క్లుప్తంగా

రాజకీయ పార్టీల జెండాల తొలగింపు



గాలాయగూడెంలో టీడీపీ జెండాలను తొలగిస్తున్న ఉద్యోగులు

దెందులూరు: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ పార్టీ జెండాలను మండలంలో తొలగించలేదు. శుక్రవారం గాలాయగూడెం సచివాలయం పక్కన, నాగులదేవునిపాడు పాఠశాల ఎదుట ఉన్న టీడీపీ, బీజేపీ జెండాలను గ్రామ పంచాయితీ ఉద్యోగులు తొలగించారు. విషయాన్ని వారు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్యకు తెలియజేశారు.

చర్చిల్లో శ్రమకాల దీక్షాధారుల ప్రార్థన



దెందులూరు ఆర్సీఎం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పారీస్ క్రీస్ట్ ఫాదర్ అమ్మన్‌రాజా

దెందులూరు: శ్రమకాల దీక్షలు చేపట్టిన దీక్షాధారులు నిరంతర ప్రార్థన, సత్ప్రవర్తనతో ఉండాలని ఏలూరు ఆర్సీఎం చర్చి ఫాదర్ అమ్మన్‌రాజా అన్నారు. శుక్రవారం దెందులూరు ఆర్సీఎం చర్చిలో, అన్ని గ్రామాల్లో సాల్వేషన్ ఆర్మీ, 7వత్ డే, సీఎస్ఐ, ఐసీఎం, మన్నా ఉన్న వివిధ క్రైస్తవ చర్చిల్లో శ్రమకాల ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల్లో సిస్టర్లు, ఉపదేశీయులు, సంఘ పెద్దలు, దీక్షాధారులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



పిప్పరలో విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

గణపవరం: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, దీనికి సంబంధించిన సమాచారం తమకు తెలియజేయాలని గణపవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో టీఎల్ సరస్వతి అన్నారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పరలో విద్యార్థులకు బాల్యవివాహాలు, దాని వల్ల కలిగే దుష్పలితాలు, విధించే శిక్షలు, మహిళలకు ప్రత్యేక చట్టాలు తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో పిప్పర సెక్టార్ ఐసీడీఎస్ సూపర్ వైజర్ జి.చంద్రావతి, పిప్పర హైస్కూలు హెచ్ఎం గొర్రెల బాలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్వా రైతుల శ్రేయస్సే లక్ష్యం



పూళ్లలో దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ వ్యాపార కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎండీ ఏవీ సుబ్రహ్మణ్యం

భీమడోలు: ఆక్వా రంగం అభివృద్ధి, రైతుల సంక్షేమమే లక్ష్యంగా దీపక్ నెక్స్‌జెన్ ఫీడ్స్ పని చేస్తుందని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఏవీ సుబ్రహ్మణ్యం అన్నారు. పూళ్ల, ఎంఎంపురం రోడ్డులో శుక్రవారం వీనస్ ఆక్వా ఫుడ్స్ నూతన వ్యాపార దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. డైరెక్టర్ కె.సత్యనారాయణ గోడౌన్‌ను ప్రారంభించారు. ఆక్వా రంగంలో నాణ్యమైన మేత, ఎరువులు, పురుగు మందును అందుబాటు ధరలకు అందిస్తూ దీపక్ నెక్స్‌జెన్ ఫుడ్స్ దేశ స్థాయిలో రెండో స్థానాన్ని పొందిందని ఏవీ సుబ్రహ్మణ్యం తెలిపారు. డైరెక్టర్లు ఎంవీవో మల్లేశ్వరరావు, ఏ.శేషు, టి.శ్రీనివాస్, మేనేజింగ్ భాగస్వామి కె.ప్రభు, డీలర్ పెద్దిరెడ్డి మనోజ్, పెంకన్న, హరిబాబు, ఉప్పు వెంకటరమణ, పి.సాయి, తీగల నరేష్ పాల్గొన్నారు.

ఆహార పదార్థాలను రుచిగా తయారు చేయాలి

భీమడోలు: జగనన్న గోరుముద్ద పథకాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షుడు రాలు పాము సునీతమాన్‌సింగ్ అన్నారు. భీమడోలు-1 ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం వారు పరిశీలించారు. మెనూ ప్రకారం పప్పు, తోటకూర, చిక్కీ, కోడి గుడ్డు చిన్నారులకు అందించారు. చిన్నారులతో కలిసి వారు భోజనం చేసారు. ఆహార పదార్థాలను మరింత రుచిగా తయారీ చేయాలని ఎండీఎం నిర్వాహకులకు వారు సూచించారు. భీమడోలులో డ్వాక్రా సంఘాల ఆర్థిక లావాదేవీలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై నిర్వహించిన సోషల్ ఆడిట్‌ను వారి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బాలిన సత్యనారాయణ, వార్డు సభ్యులు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు

- పంట నమోదు, ఈ-కేవైసీకి ఈనెల 28 వరకు గడువు
- 55,418 ఎకరాల్లో వరి, ఉద్యానవన పంటల సాగు
- ఇప్పటి వరకు 65 శాతం ఈ- పంట నమోదు



ఈ- పంట నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్న ఏడీఏ పి.ఉషారాజకుమారి

భీమడోలు: గత ప్రభుత్వాల పాలనలో విత్తనం నుంచి ధాన్యం గింజ చేతికి అందే వరకూ రైతులను కష్టాలు వెంటాడేవి. అరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయినప్పుడు ఆదుకునే నాథుడు లేక అన్నదాతలు విలవిల్లాడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి వ్యవసాయం పండుగ అనే నినాదంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతిగా సాగు ప్రయోజనాలను అన్నదాతలకు అందించేందుకు ఈ- పంట విధానాన్ని అమలులోకి తీసుకువచ్చారు. ఈ విధానం ద్వారా రైతులకు అవసరమైన సాయంఅందుతోంది. రైతులు విస్తృత ప్రయోజనాలు అందుకోవాలంటే ఈ- పంట నమోదుతో పాటు తమ ఆధార్ నంబర్లతో అనుసంధానం చేసుకోవడం అవసరమని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. రైతులంతా విధిగా ఈ-కేవైసీ (ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) చేయించుకోవాలి.

ఈ- పంట ప్రాతిపదికన పథకాలు

రైతులు ఈ పంట నమోదు చేసుకోవడం, ఈ-కేవైసీ చేయించుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు పొందవచ్చు. ప్రభుత్వ పథకాలు ఈ- పంట ప్రాతిపదికన అందిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట పరిహారం అందజేత, వైఎస్సార్ ఉచిత పంటల బీమా వర్తింపు, సున్నా వడ్డీ రుణాలు అమలు, కౌలు రైతులకు కౌలు కార్డుల ద్వారా పథకాల అమలు, వైఎస్సార్ యంత్ర సేవా పథకం వర్తింపు, ఆర్బీకేల ద్వారా పెట్టుబడి సాయం, నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాల పంపిణీ, పంటల కొనుగోలు ఈ విధానం ద్వారా అమలవుతోంది. ఈ- కర్షక్ యాప్‌లో ప్రతి రైతు వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఈనెల 28వ తేదీతో ముగియనుంది.

జోరుగా ఈ-కేవైసీ నమోదు

భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లో 55,418 ఎకరాల్లో వరి, మొక్కజొన్న, ఆయిల్‌పామ్ పంటలు సాగవుతున్నాయి. ఇప్పటి వరకు ఈ- పంట నమోదు నూరుశాతం పూర్తవగా, ఈ-కేవైసీ నమోదు జోరుగా సాగుతోంది.

ఈ- పంట నమోదు ఇలా

మండలం	విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈ-కేవైసీ పూర్తికాని రైతులు	ఈ-కేవైసీ పూర్తయిన వారు	శాతం
భీమడోలు	13,368	4,780	3,984	83
ఉంగుటూరు	24,562	9,320	7,265	78
నిడమర్రు	5,737	2,327	2,137	92
గణపవరం	1,1751	6,952	6,738	97

ఈ-కేవైసీ లక్ష్యం పూర్తి చేసేందుకు చర్యలు



దాళ్వా సీజన్‌లో పంట నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. పంట నమోదు, ఈ-కేవైసీ నమోదు ఈనెల 28వ తేదీతో ముగుస్తుంది. పంట ఉత్పత్తులు ఆర్బీకేల్లో విక్రయించాలంటే రైతులు విధిగా ఈ- పంట నమోదు, ఈ-కేవైసీ చేయించుకోవాలి. పొలం వద్దకే ఆర్బీకే సిబ్బంది వెళ్లి నమోదు చేస్తున్నారు. రైతులు త్వరితగతిన ఈ పంట ప్రక్రియను పూర్తి చేసుకోవాలి.

– ఎస్పీవీ ఉషారాణి, మండల వ్యవసాయాధికారిణి, భీమడోలు

కొందరు రైతుల అనాసక్తి

ఈ- కేవైసీ చేయించుకునేందుకు తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్న రైతులు ఆసక్తి చూపడం లేదు. అర ఎకరంలోపు సాగు చేసే రైతులు పండించిన ధాన్యాన్ని కుటుంబ అవసరాల కోసం వాడుకుంటున్నారు. మరికొంత మంది రైతులు మార్కెట్‌లో అమ్ముకుంటున్నారు. రైతులు తమ ఆధార్ నంబర్లకు ఫోన్ నంబర్లు అనుసంధానం చేసుకోవడం లేదు. వారికి ఈ-కేవైసీ చేసే తరుణంలో వేలిముద్రలు వేయగానే ఓటీపీ రావడం లేదు. వ్యవసాయ శాఖ సిబ్బంది అనేక సార్లు రైతులకు మొరపెట్టుకున్నా వారు ఆసక్తి చూపడం లేదు. దీనితో ప్రతి సీజన్‌లోను ఒక్కొక్క ఆర్బీకే పరిధిలో 10 నుంచి 20 శాతం రైతులు ఈ-కేవైసీ చేయించుకోవడం లేదు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



నీటి తొట్టెలలో పెరుగుతున్న దోమలు, లార్వాను చూపిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: అన్ని వ్యాధులకు మూలం దోమలు, అపరిశుభ్రతేనని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం చేకూరుతుందని తాడేపల్లిగూడెం డివిజన్ మలేరియా అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ పరిధిలోని చిలకంపాడు, కాశిపాడులో ఆయన వైద్య సిబ్బందితో కలిసి అంటువ్యాధులు, దోమల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లోని మురుగు, నీటి కుంటలను చూపించి, వాటిలో పెరుగుతున్న దోమలు, లార్వాలను చూపించారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఇంటింటికీ కరపత్రాలను అందజేశారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గణపవరంలో: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తగు రక్షణ చర్యలు తీసుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు సంతోష్ నాయుడు, కిరణ్మయి అన్నారు. శుక్రవారం గణపవరం, పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామమంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. సీహెచ్‌వో విల్సన్‌బాబు, జి.వరలక్ష్మి, ఆరోగ్య సహాయకుడు యోహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి



అంగన్‌వాడీ సెంటరులో చిన్నారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాంచారయ్య

పెదపాడు: విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు పెదపాడు మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు సూచించారు. శుక్రవారం పెదపాడు మండలంలోని గోగుంట ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో తరగతుల వారీగా అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. 1,2 తరగతులు పిల్లల్లో అభ్యసనా సామర్థ్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. 3,4, 5 తరగతుల్లో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించేందుకు పలు సూచనలు చేసారు. మధ్యాహ్న భోజనం పథకం, గుడ్లు, స్టాక్ పరిశీలించారు. పాఠశాల సమస్యలపై ఆరా తీసారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, స్టాక్ పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని వారికి మెమోలు జారీ చేయాలని సూపర్‌వైజర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వసంతవాడ పంచాయతీ కార్యదర్శి పీవీ రమణ పాల్గొన్నారు.

రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

దెందులూరు: చిన్నారులు, గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలందిస్తోందని తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య అన్నారు. శుక్రవారం గాలాయగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. రిజిస్టర్లు, గుడ్లు, పోషక పదార్థాలు తనిఖీ చేశారు. అనంతరం చిన్నారులకు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్ర నిర్వాహకులందరూ సక్రమంగా సేవలందించకపోయినా, రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. తహసీల్దార్ వెంట వీఆర్ఓ విష్ణు, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

అనుమతుల్లేకుండా స్టాక్ ప్రదర్శిస్తే కఠిన చర్యలు



పురుగు మందుల స్టాక్‌ను స్వాధీనం చేసుకుంటున్న ఏడీఏ పి.ఉషారాజకుమారి, ఏవో ఎస్పీవీ ఉషారాణి

భీమడోలు: భీమడోలులో ఎటువంటి అనుమతులు లేకుండా తమ కంపెనీకి చెందిన స్టాక్ ప్రదర్శిస్తుండడంతో శుక్రవారం రాత్రి వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక దాడి చేసారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రదర్శనకు ఉంచిన ప్రైవేటు కంపెనీకి చెందిన రూ.1,51,336 విలువ గల పురుగు మందులను భీమడోలు ఏడీఏ డాక్టర్ పి.ఉషారాజకుమారి, మండల వ్యవసాయాధికారిణి డాక్టర్ ఎస్పీవీ ఉషారాణి దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. వాస్తవానికి ప్రైవేటు కంపెనీలు తమ ఉత్పత్తులపై రైతులకు అవగాహన కల్పించేందుకు ముందస్తుగా వ్యవసాయాధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలి. నిబంధనలు పాటించకుండా ప్రైవేటు కంపెనీకి చెందిన ప్రతినిధులు పురుగు మందులను తీసుకుని భీమడోలు బైపాస్ రోడ్డులోని మూడు గుళ్ల వద్ద భారీ సంఖ్యలో హాజరైన రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. దీనిపై వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో వారి ఆదేశాల మేరకు భీమడోలు ఏడీఏ, ఏవోలు ఆకస్మిక దాడి చేసారు.


కంప్యూటర్ విద్యతో నైపుణ్యాభివృద్ధి



దాతలు రామకృష్ణ దంపతులకు సత్కారం

ఉంగుటూరు: కంప్యూటర్ విద్యతో నైపుణ్యాభివృద్ధి సాధించవచ్చని ఎన్ఆర్ఐ సనపల రామకృష్ణ అన్నారు. శుక్రవారం కైకరం హైస్కూల్లో రూ.30 లక్షలు విలువైన 30 కంప్యూటర్లు, ఫర్నీచర్, ఐదు డిజిటల్ టీవీలు, ఐదు ల్యాప్‌టాప్‌లు రామకృష్ణ స్థాపించిన కైట్స్ సంస్థ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ కైకరంలో ప్రాథమిక, ఉన్నత విద్య అభ్యసించి, కాకినాడ ఇంజనీరింగు కాలేజీలో గోల్డ్ మెడల్ సాధించి, ఢిల్లీ ఐఐటీలో ఎంటెక్ పూర్తిచేసి అమెరికాలో స్థిరపడినట్టు తెలిపారు. విద్యార్థులు కంప్యూటర్ విద్యలో నైపుణ్యం సాధించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. హెచ్ఎం చేబ్రోలు శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రామకృష్ణారావు, భార్య భానుమతి, ఆయన మిత్రులు గుండెపల్లి అప్పారావు, ఎల్లంకి జయదేవ్, గ్రామ ప్రముఖులు కూనా కృష్ణారావు, కూనా అప్పారావు, పుష్పాలగోపి పాల్గొన్నారు.

చల్లాలమ్మ ట్రస్టీ చైర్మన్‌గా శ్రీరెడ్డి శ్రీనివాసు ఎంపిక



శ్రీరెడ్డి శ్రీనివాసరావును పూలమాలలతో అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామదేవత చల్లాలమ్మ ఆలయ ట్రస్టీ బోర్డు చైర్మన్ పదవికి శ్రీరెడ్డి శ్రీనివాసరావు ఎంపికయ్యారు. చైర్మన్ పదవి ఎంపిక కోసం శుక్రవారం ఉంగుటూరు భీమేశ్వరస్వామి ఆలయం వద్ద గ్రామ వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఉంగుటూరు-1 ఎంపీటీసీ సభ్యుడు పెనుగొండ బాలకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. దూసనపూడి లక్ష్మీనారాయణ, శ్రీరెడ్డి శ్రీనివాసరావు చైర్మన్ పదవి కోరడంతో చీటీల ద్వారా ఓటింగు నిర్వహించారు. శ్రీరెడ్డి శ్రీనివాసరావుకు మద్దతు ఎక్కువగా ఉండటంతో ఆయనను చైర్మన్ పదవికి ఎంపిక చేశారు. పార్టీ కార్యకర్తలు ఆయనను పూలమాలలతో అభినందించారు. చైర్మన్ పదవికి శ్రీరెడ్డి శ్రీనివాసరావు పేరును పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే వాసుబాబుకు సిఫారసు చేశారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ- 2 సందక శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ వీవర్స్ వింగు జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పార్టీ నాయకులు బావన సూరిబాబు, పిళ్ళా రామకృష్ణ, తల్లాప్రగడ శివరామ్, పత్తిపాటి దుర్గం, యడ్లపల్లి వెంకట్రావు, మారిశెట్టి సత్యనారాయణ, చల్లా సూర్యారావు నాయుడు, కాళ్ల అచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చక్కని విద్యాబోధన అందించాలి

భీమడోలు: విద్యార్థులకు చక్కని విద్యాబోధనను అందించి వారి ఉన్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని భీమడోలు మండల ప్రత్యేకాధికారి ఏపీఆర్ గంగాధరరావు అన్నారు. భీమడోలు-3 ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మిక సందర్శన చేసారు. అక్కడ నాడు -నేడు పథకంలో చేపట్టిన పనుల వివరాలను హెచ్ఎం జి.మేరి ప్రసాద్ నుంచి అడిగి తెలుసుకున్నారు. మండల నాడు -నేడు నోడల్ అధికారి ఎం.శరీన్, టీచర్ పద్మాలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

దెందులూరు: దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసలు, మినుములు కొనుగోలు కేంద్రం శనివారం ప్రారంభించనున్నట్టు దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు తెలిపారు. దళారుల మాటలు నమ్మి మినుములు, పెసలు రైతులు తక్కువ ధరకు పంట ఉత్పత్తులను అమ్ముకోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న దెందులూరు కోఆపరేటివ్ సొసైటీలో ఏపీ మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు తెలియజేస్తున్నారన్నారు.

రామాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన



రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: సోమవరప్పాడులో నూతనంగా నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శంకుస్థాపన చేశారు. ఆయన వెంట మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ సరిగే నాగరాజు, గ్రామ పెద్దలు తదితరులున్నారు.

నేడు గృహసారథుల సమావేశం

పెదవేగి : ఏడు గ్రామాలకు సంబంధించిన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు పెదవేగి మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ కేశన సతీష్ చెప్పారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పెదవేగి సొసైటీ పరిధిలోని శనివారం పెదవేగి, గార్లమడుగు, లక్ష్మీపురం, కొప్పులవారిగూడెం, న్యాయంపల్లి, కూచింపూడి, రామశింగవరం సచివాలయాలకు సంబంధించిన కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు, వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పాల్గొంటారని, కావున ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సతీష్ కోరారు.

రైతుల అభ్యున్నతికి పథకాలు దోహదం



దెందులూరు సదస్సులో పాల్గొన్న ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శిక్షణ విద్యార్థులు

దెందులూరు: రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దోహదం చేస్తాయని, వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (రాజమండ్రి) శిక్షణ విద్యార్థులు సూచించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం , ఏరువాక కేంద్రం దెందులూరు కోఆపరేటివ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కోఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో పని అనుభవ కార్యక్రమంలో భాగంగా విశ్లేషాత్మక సదస్సు నిర్వహించారు. గ్రామ చిత్రపటాన్ని నేలపై ప్రదర్శించి రైతుల ఇబ్బందులపై చర్చించారు. సాగుకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు, సలహాలు వివరించారు. కార్యక్రమంలో ఎస్. శ్వేత, ఎస్. గిరిజ, ఎల్.లక్ష్మి, జ్యోతిక, జీ. దరణి, వై.ప్రమీల లు ఏఓ గద్దె రమేష్, సొసైటీ చైర్మన్ కొలుసుగణపతి రావు, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



భీమడోలులో కోర్టు వద్ద విధులను బహిష్కరించి నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

భీమడోలు: హైదరాబాద్‌లోని ఎల్బీ నగర్‌కు చెందిన న్యాయవాది ఎస్.సురేందర్‌పై ఓ వ్యక్తి విచక్షణా రహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన ఒదుకు నిరసనగా శుక్రవారం భీమడోలు జూనియర్ సివిల్ కోర్టు న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. దాడి చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన వ్యక్తం చేస్తూ వారంతా నినాదాలు చేసారు. న్యాయవాదులపై దాడులు పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని నినదించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొరింకల విజయరాజు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులను అరికట్టేందుకు చట్టం తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొరింకల విజయరాజు, ఉపాధ్యక్షుడు కాలి నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ సభ్యులు పి.రాజారావు, పి.రాజారావు, తోట ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలి



గ్రామ సచివాలయాన్ని సందర్శించిన స్త్రీ శిశు సంక్షేమశాఖ డిప్యూటీ డైరక్టరు డాక్టరు సిరి

పెదపాడు: పిల్లల్లో పోషణ లోపాన్ని గుర్తించి వారిని ఆరోగ్యవంతులుగా మార్చేందుకు గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి, ఏఎన్ఎంలు తగు చర్యలు తీసుకోవాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరక్టరు ఏ సిరి తెలిపారు. శుక్రవారం పెదపాడు మండలంలోని అప్పనవీడులోని గ్రామ సచివాలయాన్ని ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆమె సచివాలయ రికార్డులు పరిశీలించి వారికి సూచలను సలహాలు అందించారు. సచివాలయంలో లబ్ధిదారుల జాబితాలను పరిశీలించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత లేకుండా గర్భిణులకు తగు సూచనలు సలహాలు, పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రాజెక్టు డైరక్టరు కేవీఎల్ పద్మావతి, అదనపు సీడీపీవో యంఎస్ రాజశేఖర్, విస్తరణాధికారి వి మల్లిక, అంగన్‌వాడీ పర్యవేక్షకులు నూర్జహాన్, లలిత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలేయ వ్యాధి బాధితుడికి ఆర్థిక సాయం

భీమడోలు: తీవ్ర అనారోగ్యానికి గురైన పోలసానిపల్లిలోని మద్ది సుబ్బారావును శుక్రవారం సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా, వార్డు సభ్యులు, వైసీపీ నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. పోలసానిపల్లిలోని 10వ వార్డు పరిధిలోని మద్ది సుబ్బారావుకు కాలేయం పూర్తిగా పాడవడంతో విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైద్యానికి డబ్బుల్లేక కుటుంబ సభ్యులు ఆయనను తమ ఇంటికి తీసుకు వచ్చారు. ఈ విషయాన్ని తెలుసుకుటున్న సర్పంచ్ షేక్ రహీమాబేగం హసీనా, వార్డు సభ్యులు, వైసీపీ నాయకులు సుబ్బారావును పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ విషయాన్ని సర్పంచ్ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దృష్టికి తీసుకుని వెళ్లారు. ప్రభుత్వ పరంగా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. దాతలు తమ వంతు దాతృత్వాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్రప్రసాద్, వార్డు సభ్యురాలు మడికే కనకదుర్గ, అయ్యప్ప, వలంటీర్ వెంకటలక్ష్మీ, వైసీపీ నాయకులు సురేష్ పాల్గొన్నారు.

ఈనాడు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



గాలాయగూడెంలో ఈనాడు పత్రులను దహనం చేస్తున్న గ్రామస్తులు

దెందులూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని కించపరిచేలా అవాస్తవాలను ప్రచురించిన ఈనాడు యాజమాన్యంపై తగి న చర్యలు తీసుకోవాలని గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు డిమాండ్ చేశారు. సంవత్సరాల కిందటి ఫొటోలను ఇప్పుడు జరిగినట్లు దురుద్దేశ్యపూరితంగా వార్తలను ప్రచురించినంత మాత్రాన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీర్తి ప్రతిష్టలు తగ్గవన్నారు. ఈనాడు రాతలకు నిరసనగా పేపర్లను రోడ్డుపై దహనం చేశారు.

భార్య కనిపించడం లేదని భర్త ఫిర్యాదు

భీమడోలు: తన భార్య కనిపించడం లేదని భర్త భీమడోలు పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేసాడు. భీమడోలు పంచాయతీ శివారు ఆర్జావారిగూడెంకు చెందిన వివాహిత ఈనెల 14 నుంచి కనిపించడం లేదని భర్త పెద్దిరాజు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. భీమడోలు ఎస్సై చావా సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.